జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 20 | జులై | 2026 • పేజీలు : 4

## భక్తి శ్రద్ధలతో గుర్రాల చెరువు గ్రామంలో ఆషాడ బోనాలు

**అశ్వరావుపేట జూలై 19 ప్రజా జ్యోతి** బోనం ఎత్తుకున్న కాసాని పద్మ – కౌన్సిలర్ ఉదయ జ్యోతి తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన ఆషాడ మాస బోనాల వేడుకలు. గుర్రాల చెరువు గ్రామంలో ఘనంగా జరిగాయి. ఆషాడంలో అమ్మవారిని పూజిస్తే సుఖసంతోషాలు, వర్షాలు కురిసి పంటలు పండుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో గ్రామ దేవతకు ప్రముఖ నాయకురాలు కాసాని పద్మ బోనం ఎత్తుకుని గ్రామ వీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఆమె వెంట



అశ్వారావుపేట మున్సిపాలిటీ BRS పార్టీ కౌన్సిలర్, ప్రముఖ వైద్యురాలు డా. భూక్యా ఉదయ జ్యోతి కూడా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

**ఆషాడ మాస విశిష్టత**

ఆషాడ మాసంలో గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంప్రదాయం. అమ్మవారికి బోనం సమర్పిస్తే అనారోగ్యాలు తొలగి, గ్రామంలో సుఖశాంతులు నెలకొంటాయని పెద్దల నమ్మకం. ఈ నెలంతా గ్రామాల్లో బోనాలు, పూజలు, అన్నదానాలు జరుగుతాయి.

**దైవాంశతో సాగిన ఊరేగింపు**

ఉదయం నుండే గ్రామంలో కోలాహలం నెలకొంది. మహిళలు కొత్త చీరలు

మిగతా 2 లో...



# 'ఆథెంటిక్'గా.. ఇది మరీ విడ్డూరం..!

**కార్పొరేటర్ వివరణతో 'అన్ఆథెంటిక్'గా మరిన్ని ప్రశ్నలు..**

**రాజకీయ వర్గాల్లో కొనసాగుతున్న 'ఆథెంటిక్' చర్చ..**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 19, ప్రజా జ్యోతి :** "ఆథెంటిక్ సమాచారం ఆధారంగానే వార్తలు ప్రచురించాలి" అని 11వ డివిజన్ కార్పొరేటర్ పగడాల ఆకాంక్ష కోరిన నేపథ్యంలో, ఆమె ఇచ్చిన వివరణ కొత్తగూడెం రాజకీయాల్లో 'అన్ఆథెంటిక్'గా మరోసారి చర్చకు దారితీసింది. గత శనివారం కార్పొరేటర్ పగడాల ఆకాంక్ష తన తండ్రితో కలిసి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కుటుంబ సభ్యులను కలిసిన సందర్భంగా దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో ఆమె బీజేపీలో చేరనున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. ఈ నేపథ్యంలో వెలువడిన వార్తా కథనంపై స్పందించిన కార్పొరేటర్.. తాను కేవలం తన చెల్లికి డిగ్రీ కాలేజీలో సీటు విషయంలో సహాయం కోరేందుకే బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కుటుంబ సభ్యులను కలిశానని, దీనికి రాజకీయ రంగు పులమడం సరికాదని ఆమె విలేకరుల

మిగతా 2 లో...

## అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం



**-రొంపేడు గ్రామంలో 33/11 కెవి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన**

**-ముత్యాలంపాడు క్రాస్ రోడ్ వద్ద నూతన 33/11 కెవి సబ్ స్టేషన్ ప్రారంభం**

**-విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం**

**-1912 టోల్ ఫ్రీ సేవలు, పవర్ అంబులెన్స్‌లతో విద్యుత్ సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు**

**-సింగరేణి అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధం**

**-ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణతో అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ఇల్లందు, జులై 19 (ప్రజా జ్యోతి)** అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌లో ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం ఇల్లందు నియోజకవర్గంలోని ఇల్లందు మండలంలోని రూ. 3.25 కోట్లతో రొంపేడులో 33/11 కె.వి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం టేకులపల్లి మండలంలోని ముత్యాలంపాడులో

మిగతా 2 లో...

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు తప్పనిసరి

**-ఎస్ఐఆర్ పారదర్శకంగా కొనసాగాలంటే బిఎల్ఎ లే కీలకం**



**ఇల్లందు, జులై 19 (ప్రజా జ్యోతి)** ప్రతి అర్హుడికి ఓటు హక్కు తప్పనిసరి అని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. ఆదివారం స్థానిక బిఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన బిఎల్ఏ ల సమావేశం మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు మాట్లాడు తూ ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్క పోలింగ్ బూత్ బిఎల్ఎ చురుకుగా పని చేయాలని సూచించారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని ప్రతి ఒక్కరు నిర్లక్ష్యం నమస్తే వహించకుండా ఎస్ఐఆర్ ఫ్యామిలీ నుంచి బిఎల్ఓలకు అందజేయాలన్నారు. సమాజంలో బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలంటే ఓటు వల్లే సాధ్యమవుతుందని సూచించారు. ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు ఎస్ఐఆర్ పై ఎలాంటి సందేహం ఉన్నా కూడా మన పార్టీ బిఎల్ఎలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఏ ఒక్క అర్హుడైన ఓటర్ కూడా

మిగతా 2 లో...

## కట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

**భర్తతో పాటు ముగ్గురిపై కేసు నమోదు**

**టేకులపల్లి,జూలై 19, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలో కట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. శంభునిగూడెం గ్రామానికి చెందిన భట్టు భద్రయ్య తన కుమార్తె సుమ మృతికి భర్తతో పాటు కుటుంబ సభ్యులే కారణమంటూ టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు, 2023 మే 16న లక్ష్మీదేవిపల్లి మండలం కొత్తచింతకుంట గ్రామానికి చెందిన

మిగతా 2 లో...



## భక్తి శ్రద్ధలతో గుర్రాల చెరువు గ్రామంలో ఆషాడ బోనాలు

(మొదటి పేజీ తరువాయి...)
ధరించి, తలపై బోనాలు, పసుపు కుంకుమతో అలంకరించుకుని "బోలో బోనాలమ్మా" నినాదాలతో ఆలయానికి చేరుకున్నారు. డోలు, మంగళ వాయిద్యాలతో వాతావరణం భక్తిమయంగా మారింది. కాసాని పద్మ మాట్లాడుతూ, "అమ్మవారి కృపతో గ్రామంలోని ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు ఉండాలని, రైతులకు మంచి వర్షాలు పడి పంటలు పండాలని కోరుకున్నాం" అని అన్నారు. డా. ఉదయ జ్యోతి మాట్లాడుతూ, "ఇలాంటి సాంప్రదాయాల ద్వారానే మన సంస్కృతి నిలబడుతుంది. ప్రజలందరూ భక్తితో పాల్గొనడం అభినందనీయం" అని తెలిపారు.

**అన్నదానం – ప్రత్యేక పూజలు**

బోనాల అనంతరం గ్రామంలో అన్నదానం నిర్వహిస్తున్నట్టు స్థానిక పెద్దలు తెలిపారు. సాయంత్రం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు, హారతి ఇచ్చి భక్తులు ప్రసాదం అందజేస్తారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు, మహిళా సంఘాల సభ్యులు, పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు తప్పనిసరి



(మొదటి పేజీ తరువాయి...)




ఓటు హక్కును కోల్పోకుండా బిఆర్ఎస్ పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్స్ కట్టుబడిగా ఐకమత్యంతో పని చేయాలని బిఎల్ఎ లకు సహకరించి ఓటర్ల యొక్క సమస్యలను సందేహాలను నివృత్తి చేస్తూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు ప్రతి ఓటుకు రక్షణ అనే లక్ష్యంతో టిఆర్ఎస్ సైనికులు ముందుకు సాగుతూ చురుకుగా వ్యవహరించాలని కొన్ని కొన్నిచోట్ల కొన్ని అవాంతర సంఘటనలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి బిఎల్ఓ లతో కలిసి పని చేయాలన్నారు. అంతకుముందు ఇల్లందు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భూక్య దళ్ సింగ్ నాయక్, సిరి వేరు సత్యనారాయణ, లకావత్ దేవి నాయక్, నాయకులు గిన్నారపు రాజేష్, కాసాని హరిప్రసాద్ యాదవ్, సత్తాల హరికృష్ణ, ఎంటెక్ మహేందర్, చాంద్ పాషా, హరి గోపాల్ శర్మ, కొంటు రవికాంత్, నెమలి నిఖిల్, మిర్జా బేగ్, వార రమేష్, సొలమెన్, నెమలి ధనలక్ష్మి, నారాయణమ్మ, సులోచన, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి...)



వజ్జి వెంకటేశ్వర్లుతో సుమ వివాహం జరిగింది. వివాహం తర్వాత అదనపు కట్నం కోసం భర్తతో పాటు కుటుంబ సభ్యులు శారీరకంగా, మానసికంగా వేధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జూలై 18న నిందితులు ఇంటికి వచ్చి దాడి చేయడంతో మనస్తాపానికి గురైన సుమ పురుగుల మందు తాగగా, కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూలై 19న మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు మరో ముగ్గురిపై టేకులపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 'ఆథెంటిక్'గా.. ఇది మరీ విడ్డూరం..!

(మొదటి పేజీ తరువాయి...)
సమావేశంలో స్పష్టం చేశారు. అయితే ఆ వివరణతోనే గూడెం లో మరికొన్ని ప్రశ్నలు 'ఆథెంటిక్' గా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఆమె కేవలం డిగ్రీ సీటు కోసమే అంతదూరం వెళ్లి కమ్యునిస్టులకు బద్ద శత్రువులుగా ఉన్న బిజెపి పార్టి ఎంపీ కుటుంబ సభ్యులను కలిశాను అని చెప్పడం ఎ మాత్రం 'ఆథెంటిక్' గా లేదని పలువురరు చర్చించుకుంటున్నారు. అందులో భాగంగానే గతంలో సిపిఐ పార్టీ లో జరిగిన కొన్ని అంశాలను గుర్తు చేసుకుంటూ 'ఆథెంటిక్' గా విశ్లేషణ చేస్తున్నారు.

**'ఆథెంటిక్' ఉదాహరణలు...**

కొత్తగూడెం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ప్రస్తుతం అధికార వ్యవస్థలో ఆయనకు ఉన్న రాజకీయ ప్రాధాన్యం, ప్రభుత్వంతో ఉన్న సంబంధాల నేపథ్యం రాష్ట్ర ప్రజలందరికి చాల 'ఆథెంటిక్' గా తెలుసు. అయితే ఒక విద్యా సంబంధిత సమస్య కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న వాళ్ళ పార్టి నేతను కాకుండా మరో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులను ఎందుకు సంప్రదించాల్సి వచ్చిందనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో 'ఆథెంటిక్' గా చర్చకు వస్తున్నాయి. ఇదే అంశాన్ని కొందరు సీపీఐ నాయకులు, స్థానిక రాజకీయ పరిశీలకులు కూడా చాల 'ఆథెంటిక్' గా చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే కొత్తగూడెం రాజకీయాల్లో సీపీఐ పార్టీ నేతల మార్పుల అంశం కొత్త విషయం కావు. వీటికి గతంలో చాల 'ఆథెంటిక్' ఉదాహరణలు ఉన్నాయి. సీపీఐ నుంచి ఎన్నికైన కొందరు కౌన్సిలర్ లు చివరి వరకు లెఫ్ట్ భావజాలలున్న కమ్యునిస్టు పార్టీతోనే ఉంటామని 'ఆథెంటిక్' గా ప్రకటించినప్పటికీ.. అనంతరం రైట్ భావజాలలున్న ఇతర పార్టీల్లో చేరిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ రాజకీయ పరిణామాలు ఇప్పటికీ స్థానిక రాజకీయాల్లో 'ఆథెంటిక్' గా చర్చనీయాంశంగానే ఉన్నాయి. అలాంటి అనుభవాల నేపథ్యంలోనే ప్రస్తుత ఘటనను కూడా రాజకీయంగా 'ఆథెంటిక్' గానే పరిశీలిస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**'అన్ఆథెంటిక్' గా చెప్పాలంటే..**

'ఆథెంటిక్' గా చెప్పాలంటే ప్రస్తుతం 11 వ డివిజన్ కార్పొరేటర్ పగడాల ఆకాంక్ష తండ్రి గతంలో మాజీ ఎమెల్యే జలగం వెంకట్రావు అనుచరుడని పలువురు అంటున్నారు. ఇప్పుడేదో కాలం కలిసొచ్చి సిపిఐ పార్టి తరుపున తన కూతురును నిలబెట్టి కార్పొరేటర్ ను చేశాడని, కాకపోతే తను పూర్తిగా ఈ కమ్యునిస్ట్ భావజాలలకు ఇమిడిపోలేదని స్థానికంగా చర్చ నడుస్తోంది. అందుకే కేవలం డిగ్రీ సిటు కోసం ఓ ఎంపి ఫ్యామిలీ ని కలిసామని వాళ్ళు అంటున్నారని, అందులో ఎ మాత్రం నిజం లేదని పలువురు చాల 'ఆథెంటిక్' గా చర్చించుకుంటున్నారు. నిజంగా ఆ సిటే కావాలంటే కూనంనేని సాంబశివరావు ఒక్క ఫోన్ తో ఇప్పియగల సామర్థ్యం ఉన్న నేత అని, కాని అలాకాకుండా వాళ్ళు ఇతర పార్టి నేతల దగ్గరకు వెళ్ళడం 'అన్ఆథెంటిక్' గా ఉందని పలువురు విశ్లేసిస్తున్నారు. కచ్చితంగా ఉద్దేశాపుర్వకంగానే వాళ్ళు ఈ భేటిని ఏర్పటుచేసుకున్నారని, కాకపోతే అక్కడ చర్చలు విఫలం కావడంతో 'ఆథెంటిక్' గా తిరిగి ఇక్కడికి వచ్చి రాజకీయ విలువలను దెబ్బ తీసేలా 'అన్ఆథెంటిక్' గా వివరణ ఇస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

### రాజకీయ పరిణామాల 'ఆంచేలకు'..?

ఇప్పటి వరకు కార్పొరేటర్ పగడాల ఆకాంక్ష మాత్రం తాను పార్టీ మారడం లేదని స్పష్టంగా ప్రకటించారు. అలాగే ఆమె బీజేపీలో చేరుతున్నట్లు సీపీఐ గానీ, బీజేపీ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ప్రస్తుతం ఉన్నది ప్రచారం ఒకటి, కార్పొరేటర్ ఇచ్చిన వివరణ మరోటి అనే పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవహారంపై భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాల్సి ఉన్నప్పటికీ, ఒక వైరల్ ఫొటోతో ప్రారంభమైన చర్చ ఇప్పుడు అధికారిక వివరణల దశకు చేరుకోవడం కొత్తగూడెం రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. ఇక ఈ వివరణతోనే చర్చకు ముగింపు పడుతుందా? లేక మరిన్ని రాజకీయ పరిణామాల 'ఆంచేలకు' ఇది నాంది అవుతుందా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

# అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)
నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కెవి సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తూ విద్యుత్ మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. కొత్త విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటు, విద్యుత్ లైన్ల ఆధునికీకరణ, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాల పెంపు వంటి కార్యక్రమాలను ప్రాధాన్యతతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు, ఉద్యోగుల సంక్షేమం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బొగ్గు వనరుల వినియోగం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. సింగరేణి ప్రాజెక్టుల ప్రభావిత నిర్వాసితులకు న్యాయం చేయడంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. సింగరేణి కార్మికులతో పాటు విద్యుత్ రంగ సంస్థల ఉద్యోగుల భద్రత కోసం ప్రమాద బీమా పథకాలు అమలు చేస్తున్నామని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.20



కోట్ల ప్రమాద బీమా రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా విస్తృత కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. పోడు భూముల హక్కులు పొందిన గిరిజన రైతుల వ్యవసాయాభివృద్ధి కోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా ఉచిత సౌర విద్యుత్, బోర్ బావులు, పంపుసెట్లు, డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నప్పటికీ, ప్రజలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తుందన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. వైద్య రంగంలోని 108 అత్యవసర సేవల తరహాలో విద్యుత్ శాఖలో ప్రవేశపెట్టిన పవర్ అంబులెన్స్ సేవల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, అవసరమైన పరికరాలు, సాంకేతిక సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 165 పవర్ అంబులెన్స్‌లు ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని సూచించారు. తాగునీటి వనరుల పరిరక్షణ, వన్యప్రాణులకు నీటి లభ్యత, వ్యవసాయ రంగానికి అవసరమైన చర్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా, అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్ లు మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రొంపేడు, ముత్యాలంపాడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ఉపకేంద్రాల ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతమై, విద్యుత్ లోడ్ సమతుల్యం కావడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిత్రునికి అండగా స్నేహితులు

- కష్టకాలంలో సహచరుల రూ.50 వేల ఆర్థిక సాయం



**చర్ల, జూలై 19 (ప్రజా జ్యోతి):** స్నేహం అంటే కేవలం పాఠశాల జ్ఞాపకాలు మాత్రమే కాదని ఆపదలో అండగా నిలవడమే నిజమైన స్నేహమని చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఎస్సీ–2000 బ్యాచ్ విద్యార్థులు మరోసారి చాటిచెప్పారు.చర్ల మండలంలోని గొమ్ముగూడెం గ్రామానికి చెందిన చర్ల ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఎస్ఎస్ సి –2000 బ్యాచ్ విద్యార్థి కురిచేటి రాఘవేంద్రరావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న అతని బాల్య మిత్రులు మానవత్వాన్ని చాటుకున్నారు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకుని స్నేహబంధాన్ని కొనసాగిస్తున్న సహచరులు స్వచ్ఛందంగా తమ మిత్రులందరు విరాళాలు సేకరించి ఆదివారం రాఘవేంద్రరావు నివాసానికి వెళ్లి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ జీవితంలో కష్టసుఖాలు సహజమేనని అయితే కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని అన్నారు. చిన్ననాటి నుంచి తమతో కలిసి పెరిగిన రాఘవేంద్రరావు ప్రస్తుతం అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయాన్ని అందించాలని ముందుకు వచ్చారని తెలిపారు. తమ సహాయం పెద్దది కాకపోయినా ఆయన కుటుంబానికి కొంత ఊరట కలిగిస్తుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు .రాఘవేంద్ర రావు త్వరగా కోలుకుని మునుపటిలా ఆరోగ్యంగా ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి జీవించాలని ఆకాంక్షించారు. స్నేహబంధం అనేది కేవలం జ్ఞాపకాలకే పరిమితం కాకుండా అవసరమైన సమయంలో అండగా నిలబడటంలోనే దాని గొప్పతనం ఉందని చెప్పారు.ఆర్థిక సాయం అందుకున్న రాఘవేంద్రరావు, ఆయన కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో తమను ఆదుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన బాల్య మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు అని ఈ సహాయం తమకు ఆర్థికంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని స్నేహితుల ప్రేమాభిమానాలు జీవితాంతం మరువలేమని అన్నారు.బడుగు రాజు, మాణిక్యాలరావు, నవీన్, మీసాల సతీష్, శోభన్ బాబు, పాపారావు, చింతా సతీష్, ఆర్. సతీష్, బాలకృష్ణ, పూజారి రమణయ్య, రవికుమార్, జనార్థన్, జోగారావు, టి. రాజేష్ కుమార్ , రమణాచారి, నరసింహమూర్తి తదితర సహచర మిత్రులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై మంత్రికి వినతిపత్రం



**చర్ల ,జూలై 19(ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలో నెలకొన్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆదివారం వినతిపత్రం అందజేశారు.భద్రాచలం పర్యటనకు వచ్చిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు, భూ రికార్డుల సవరణ, పట్టాదార్ పాస్ బుక్‌ల జారీ, భూ హక్కులకు సంబంధించిన సమస్యలు, గిరిజనులు, రైతులు ఎదుర్కొంటున్న భూ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు విజయ్ నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా చర్ల మండల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజయ్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## దళితుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేత



**చర్ల, జూలై 19 (ప్రజాజ్యోతి):** చర్ల మండలంలోని దళితులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి కాంగ్రెస్ ఎస్సీ సెల్ డివిజన్ నాయకుడు మేడబత్తిన వాసు తీసుకెళ్లారు.భద్రాచలంలో అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా పర్యటించిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. దళిత కాలనీల అభివృద్ధి, నివాస స్థలాల సమస్యలు, మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, భూ సమస్యలు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దళిత కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మేడబత్తిన వాసు మాట్లాడుతూ చర్ల మండలంలోని దళితుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆకారపు పవన్, చంటి, భాస్కర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ప్రజాప్రతినిధులపై వచ్చిన వార్తలపై వివరణ



**పాల్వంచ, జూలై 19, ప్రజా జ్యోతి :** 11వ డివిజన్ కార్పొరేటర్ పడాల ఆకాంక్షకు సంబంధించిన వార్తలపై సీపీఐ నాయకులు ఆదివారం పాల్వంచలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులకు సంబంధించిన వార్తలు ప్రచురించే సమయంలో పూర్తి సమాచారం ఆధారంగా రాయాలని కోరారు. కార్పొరేటర్‌పై వచ్చిన ప్రచారంపై తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. కార్పొరేటర్ పడాల ఆకాంక్ష మాట్లాడుతూ, కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా మాత్రమే కలిశానని చెప్పారు. దీనికి రాజకీయ సంబంధం లేదని స్పష్టం చేశారు. మరో పార్టీ ప్రజాప్రతినిధిని కలవడంలో ఎలాంటి అభ్యంతరం లేదని, తన భేటీని పార్టీ మార్పుగా ప్రచారం చేయడం సరైంది కాదని అన్నారు. అవసరమైతే ఈ అంశంపై చట్టపరంగా ముందుకు వెళ్తామని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిగంటి శ్రీనివాస్, వి. పూర్ణచంద్రరావు, నేరెళ్ల రమేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలం అధ్యక్షుడిగా ఎన్నికైన రావులపల్లి నరసింహారావు

- ఘనంగా సన్మానించిన సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ సభ్యులు



**అశ్వాపురం, జూలై 19, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేయబడిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రావులపల్లి నరసింహారావుకు మీడియా మిత్రులు శాలువాగప్పి,పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రావులపల్లి నరసింహారావు మాట్లాడుతూ మీడియా మిత్రుల సంక్షేమ కోసం తన వంతుకు తను చేస్తానని స్థలము ఇల్లు లేని మీడియా మిత్రుల సమస్యను శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్తానని, అశ్వాపురంలో జర్నలిస్టుల కార్యాలయం కు కావలిసిన స్థలం సమస్యను కూడా పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్తానని సముఖంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో కె.వి.రెడ్డి, రామిరెడ్డి, అప్పన మురళి కల్లూరు నరసింహారావు, గంగరాజు, రవి, ఏకాంబరం, వెంకట్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా కేశెట్టి ఖాదర్ బాబు



**టేకులపల్లి,జూలై 19, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రామచంద్రపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశెట్టి ఖాదర్ బాబును తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించారు. నియామక పత్రాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షుడు దారా రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, నియామకానికి కృషి చేసిన దారా రమేష్‌కు ఖాదర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆగస్టు 23న తీజ్ పండుగ నిర్వహించాలి

- టేకులపల్లి మండల సమావేశంలో నిర్ణయం



**టేకులపల్లి,జూలై 19 ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని జై సేవాలాల్–జై జగదంబ దేవి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉమ్మడి పంచాయతీ సర్పంచులు, తండాల నాయక్–కార్బరీలు, రాజకీయ నాయకులు, విద్యావంతులు, మేధావుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రావణమాసంలో జరిగే బంజారా గిరిజనుల ప్రధాన పండుగ తీజ్ ను మండలంలోని అన్ని తండాల్లో ఒకే తేదీన నిర్వహించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఆగస్టు 14న ఘువ్ గాలేరు, ఆగస్టు 15న తీజ్ బోయోరో ప్రారంభించి, ఆగస్టు 23న కాడావో–తీజ్ (వేరాయోరో) నిర్వహించాలని ప్రకటించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తీజ్ పండుగ బంజారా మహిళల భక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతి పట్ల ప్రేమ, కుటుంబ సౌభాగ్యం, ఐక్యతకు నిదర్శనమైన ఈ పండుగను ప్రతి తండాలో ఐక్యంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, జై మేరమా యాడి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతో షాలు,ఆయురారో గ్యాలు, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్త భూక్య గన్నా నాయక్, మంతు సేవాలాల్ మహారాజ్, భూక్య దళ్ సింగ్ నాయక్, బానోత్ మోతిలాల్ నాయక్, మాను నాయక్, బోడ మంచా నాయక్, భూక్య కిషోర్ సింగ్ నాయక్, బోడ పుణ్య గంగా నాయక్, భూక్య లాలు నాయక్, మూడ్ హుస్సేన్ నాయక్, హలవత్ స్వామి నాయక్, బోడా మోతిలాల్ నాయక్, మూడ్ బిచ్చు నాయక్, మూడ్ రమేష్, హమాలీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన శ్రీ గాయత్రీ వైద్యశాల బృందం

- ఆశా వర్కర్ కుటుంబానికి దహన సంస్కారాల కోసం ఆర్థిక సాయం



**దమ్మపేట, జూలై 19(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల కేంద్రానికి చెందిన శ్రీ గాయత్రీ వైద్యశాల బృందం మరోసారి తమ మానవతా దృక్పథాన్ని చాటుకుంది. పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా వర్కర్‌గా సేవలందిస్తున్న కొత్తూరు గ్రామానికి చెందిన కూరం శ్యామల అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న శ్రీ గాయత్రీ వైద్యశాల బృందం వెంటనే స్పందించి, మానవత్వంతో ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించింది.ఈ సందర్భంగా వైద్యశాల యాజమాన్యం మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయడం వైద్య వృత్తిలో భాగమే కాకుండా సామాజిక బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల యాజమాన్యంతో పాటు డాక్టర్ పి. మౌనిక, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ ఉదయ్ భాస్కర్ పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. స్థానికులు శ్రీ గాయత్రీ వైద్యశాల బృందం చేసిన ఈ సేవను అభినందిస్తూ, ఇలాంటి మానవతా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు.

## అంకమ్మ తల్లి ఆలయంలో ఆషాఢ మాసం తొలి ఆదివారం ప్రత్యేక పూజలు

- భక్తిశ్రద్ధలతో అన్న ప్రసాద వితరణ



**అన్నపురెడ్డిపల్లి, జూలై 19 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీశ్రీ అంకమ్మ తల్లి, గోపయ్య తిరుపతమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో ఆషాఢ మాసం తొలి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమ పూజ, లలితా సహస్రనామ పారాయణాన్ని గ్రామ మహిళలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ అభివృద్ధి ప్రదాత మారగాని శ్రీనివాసరావు ఆదేశానుసారం కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ పానగంటి రాఘవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్, గ్రామ పెద్దలు వనమా గాంధీ, సుగ్గల నరసింహారావు, చల్లా రమేష్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

# వినతి తెలిపే హక్కుకూ అడ్డుకట్ట..

- సేవాలాల్ సేన నాయకుల ముందస్తు అరెస్టు
- భట్టి విక్రమార్క పర్యటనలో పోలీసుల తీరుపై ఆగ్రహం



**టేకులపల్లి, జూలై 19,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క టేకులపల్లి మండల పర్యటన సందర్భంగా సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్‌తో పాటు జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని ఆ సంఘం తీవ్రంగా ఖండించింది.టేకులపల్లి మండలంలోని బోడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలని కోరుతూ ఉప ముఖ్య మంత్రికి వినతిపత్రం అందజేయడానికి వెళ్తుండగా తమను అడ్డుకుని అరెస్ట్ చేశారని నాయకులు తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రజాస్వామ్య హక్కును కాలరాయడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు.ఈ సందర్భం గా సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా రవి రాథోడ్, రాష్ట్ర కార్యదర్శి భూక్యా శ్రీను నాయక్ మాట్లాడు తూ టేకులపల్లి మండలంలోని బోడు, సిద్దారం, బర్లగూడెం, జంగాలపల్లి, ఒడ్డుగూడెం, రాజారాం తండా, లచ్చగూడెం, గంగారం, కొప్పురాయి, రామచంద్రపేట తదితర మారుమూల గ్రామాల ప్రజలు వైద్యం కోసం సుమారు 40 కిలోమీటర్ల దూరంలోని సులానగర్ పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తోందన్నారు. రవాణా సౌకర్యాలు లేక సకాలంలో వైద్యం అందక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్య అవసరాల కోసం శాంతియుతం గా వినతి పత్రం ఇవ్వడానికి సిద్ధమైన నాయకులను ముందస్తు గా అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. అరెస్ట్ చేసిన నాయకులను వెంటనే విడుదల చేయడంతో పాటు బోడు గ్రామంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ముందస్తు అరెస్టుకు గురైన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జర్పుల లాలు నాయక్, నరేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

# వనవాసీ విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ





**చర్ల, జూలై 19 (ప్రజా జ్యోతి ):** వనవాసీ విద్యార్థుల క్రమశిక్షణ ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని దుమ్ముగూడెం మండలం నర్సాపురానికి చెందిన చిన్న అరుణాచలం వ్యవస్థాపకులు శివనాగు స్వామి అన్నారు. ఆదివారం చర్లలోని కొమరం భీం విద్యార్థి నిలయాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ఆధ్యాత్మిక, నైతిక విలువలపై ప్రసంగించారు.విద్యార్థి దశలోనే మంచి అలవాట్లు అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమని జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ధ్యానం, నామస్మరణ, ఏకాగ్రత ఎంతో దోహదపడతాయని చెప్పారు. శ్వాసపై దృష్టి కేంద్రీకరించి ధ్యానం చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉండటంతో పాటు గురువులు బోధించిన విషయాలు సులభంగా అర్థమవుతాయని వివరించారు.స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ వంటి మహనీయులు దేశం, ధర్మం కోసం చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వారి ఆశయాలను కొనసాగిస్తూ దేశ సేవకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. చెడు అలవాట్లు, వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు.ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా ధర్మాన్ని విస్మరించరాదని సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు . ధర్మాన్ని అవమానించే వారిని ధైర్యంగా, చట్టబద్ధమైన మార్గంలో ఎదుర్కొనే మనోధైర్యం కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం దాతృత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బాలికలకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దాతృత్వ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అడికే కార్తీక్, అధ్యక్షులు నామ శ్రవణ్, కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, వనవాసీ జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, నిలయ కమిటీ సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, నిలయ ప్రముఖ్ సాంబయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.